

తిక్కన

[నాటిక]

● ఇందు వచ్చుపాత్రలు ●

మనుమసిద్ధి—రాజు
తిక్కన—మంత్రి
చిన్నకొమ్మన్న—తిక్కనకొడుకు (14 ఏండ్లబాలుడు)
మారన్న—దళపతి
అన్నమాంబ—తిక్కనతల్లి
సీతమ్మ—తిక్కనభార్య
ప్రోలమ్మ—ఖడ్గ తిక్కనతల్లి. అన్నమాంబ తోడికోడలు

నేను రచించుచున్న 'తిక్కన'అను నవలలోని రెండవ భాగమున రెండవ అధ్యాయమునకు ఇది రూపాంతరము. కొద్ది మార్పుతో ఒక రంగము నాటకముగా వ్రాయబడినది. అద్దంకి ప్రభువయిన మహారాష్ట్రి సారంగుడికిన్ని, నెల్లూరిప్రభువయిన మనుమసిద్ధికిన్ని సంపూర్ణవిజయము కలిగినదిగాని తిక్కన తండ్రి యున్ను, సర్వసేనాధ్యక్షుడును, గుంటూరి దండనాధుడును అయిన కొమ్మన్న యుద్ధములో చనిపోయినాడు. ఈ సమాచారము దళపతులలో నొకడును, కొమ్మన శిష్యుడును, భావిజీవితములో మార్కండేయ పురాణకర్తయును అయిన మారన్న కొమ్మన్నభార్య అయిన అన్నమాంబకు తెలుపుటకై పంపబడ్డాడు. ఆ సందర్భమునే ఈనాటిక వివరించుచున్నది.

శ్రీ పున్నవ లక్ష్మీనారాయణ

[పాతగుంటూరులో కొమ్మనదండనాథుని గృహము. చిన కొమ్మన్న, మారన్నల ప్రవేశము.]

చినకొమ్మన్న— ఏమి మారన్నా, అప్పుడే వచ్చావు? యుద్ధానికి పోలా?

మారన్న—(వంచిన తల ఎత్తకుండా) పోయే వచ్చారా.

కొమ్మన—మఱి యుద్ధం చేశావా?

మారన్న—(తల ఎత్తి) చేశాను.

కొమ్మన—ఎవరినైనా పొడిచావా? నీవు పొడవకపోతే మానె, నిన్నెవరైనా పొడిచారా? (బాగా పరికించి) ఏదీ, ఎక్కడా కత్తిగీచుకొనిపోయినట్లుగానైనా లేదే?

మారన్న—(కొమ్మనను బుజముమీద తట్టుతూ) తీవ్రయుద్ధమే జరిగింది లేరా.

కొమ్మన—(ఎగతాళిగా) యుద్ధం జరిగివుంటుంది లే. నీవుకూడా కాస్త (తన బుజము చూపి) బుజమేశావా?

మారన్న—(కొద్ది విసుగుతో) పోట్లాడాము లే, ఉండరా. (ఖిన్నముఖము పెట్టును)

కొమ్మన—ఏం, మొగమట్లా వుంది? మొదట బ్రతల్లాడుతూపోతివి - పారిపోయివచ్చావా? (సాటోపంగా ఎగాదిగా చూస్తాడు) సేనాపతిగారు మిమ్మల్నందరినీ కవ్వించి పురికొల్పంగనే, ఉస్కో అంటే ఉస్కో అని వెనక్కి పిక్కబలం జూపావా? భేరీ మోగంగనే భయపడివచ్చిన రకంలాగ కనపడుతుందే! యుద్ధంలో నుంచి పారిపోయివచ్చినవాండ్లకు ఎఱ్ఱచెరువుగట్టున మఱ్ఱిచెట్టుక్రింద మెడకు ఉచ్చు తగిలిస్తారు. జాగ్రత్త!

మారన్న—ఒరే కొమ్మన్నా! నీవాగుడు కాస్త కట్టిపెట్టు. మామ్మగా రెక్కడున్నారు?

కొమ్మన—(ఔత్సుక్యముతో) ఏవీ, యుద్ధపు సంగతులు చెప్పు.

మారన్న—చెపుతాలే. మామ్మగా రెక్కడున్నారు?

కొమ్మన—నాయనమ్మ వస్తే చెపుతావా? గౌరీపూజ చేసుకుంటున్నారు. ఇవాళ ఉపవాసం. అరుగో వస్తున్నారు. (ఎదురునడుస్తూ) నాయనమ్మా! మారన్న యుద్ధానికి పోయివచ్చాడు. వార్తలు చెపుతాట్ట. దబ్బున రా.

మారన్న—అమ్మా! నమస్కారము.

అన్నమాంబ—ఎప్పుడు వచ్చావు మారన్నా?

మారన్న—ఇప్పుడే వస్తున్నాను తల్లీ!

అన్నమాంబ—ఎక్కడనుంచి?

మారన్న—ఒంగోలునుంచి! రణరంగంనుంచి తల్లీ.

అన్నమ్మ—యుద్ధానికి తారసిల్లారా రెండు పక్షాలూ?

మారన్న—యుద్ధం పూర్తిఅయి మనకు సంపూర్ణవిజయం కలిగింది తల్లీ.

అన్నమ్మ—విక్రమసింహపుర సేనలు వచ్చి కలుసుకున్నవా?

మారన్న—అవి రాకముందే మన ఒక్క గుంటూరు సేనే కదిసింది. మన ఆశ్వికదళం వీరవిహారం చేసి—

అన్నమ్మ—(సంతోషంతో మెడ పొడిగించి) ఒక్క మీ తాతయ్యగారి సేనకే యావత్తు విజయమూ చెందుతుం దన్నమాట. ఈసారి మఱీ యుద్ధానికి పోవడమంటే స్వర్గానికి పోతున్నంత ఉత్సాహపడ్డారు.

మారన్న—(చకితుడై) అదేమి తల్లీ అట్లా అంటిరి?

అన్నమ్మ — (పూర్వభావఉద్ఘాట్యకంఠముతో) అశ్లీలం ధ్వనించిందా? పర్వాలేదు లే. (ఇష్టాగోష్ఠి ధ్వనితో) అంతా బాగున్నారా?

మారన్న—(తల వంచి) అంతా ఎట్లా బాగుంటారు తల్లీ!

అన్నమ్మ—అవును. యుద్ధంగదా! పాపం! పదాతులే ఎక్కువ పోతారు. సేనాపతులు వెనుక దూరంగా వుంటారుగనుక వారికి అపాయం తక్కువ.

మారన్న — (భావగర్భితంగా) వాండ్లుకూడ కొందరు పోతారు తల్లీ!

అన్నమ్మ—(ఆకాంక్షస్ఫూర్తితో) కేతన కులాసాగా ఉన్నాడా?

మారన్న—ఉన్నాడు తల్లీ! సైన్యంతో వస్తాడు.

అన్నమ్మ—దళపతులుకూడా దెబ్బ తింటారు. జనంలో ఉంటారుగనుక. సేనాపతులు ఎవరు పోయి నారు? అల్లాడమంత్రి కులాసాగా వున్నాడా? తాత గారికి క్షేమమా?

మారన్న— అల్లాడి కులాసాగానే వున్నాడు తల్లీ!

అన్నమ్మ—(ఆతురతతో) మరి తాతగారు?

మారన్న—తాతగారా తల్లీ!

అన్నమ్మ—(ఆవేగంతో) అవును. తాతగారు. ఏమిటి సందేహము?

మారన్న—(కళ్ల నీరు కారుస్తూ, తల వంచి) లేరు తల్లీ!

అన్నమ్మ—లేనేలేరా?

మారన్న—లేరు తల్లీ, లేరు. యశఃకాయం మాత్రం వుంది.

అన్నమ్మ—(కంట తడి ఆపుకుంటూ) ఏం జరిగిందేమిటి?

మారన్న—(వీరోత్సాహంతో) తన అయిదు వందల ఆశ్వికదళంతో పదివేల శత్రుసైన్యంపై బడి అరి భయంకరంగా ఒకజాము వీరవిహారం చేసి కఱకుటమ్ములతో పెక్కుమంది దళపతుల ప్రాణవాయువులు హరించి చివరకు సారంగుని వెన్నంటి అర్ధచంద్రబాణ ప్రయోగం చేసి సారంగుని దక్షిణబాహువును సకవచంగా ఛేదించి కొమ్మనభానుడు అస్తమించాడు తల్లీ! (అని తల వంచుకొనును)

అన్నమ్మ—(ఉత్సాహం అణచుకొని) నా నాథుని వీరకథాకథనముతో నాచెవులకు విందుచేశావోయి మారన్నా! నా నాథుని వైదికఇజ్యామంత్రరవమును, ధనుర్జ్యాసమారవమును నాచెవుల మ్రోగుతున్నవోయి. నా నాథుడు యుద్ధానికి బయలుదేరే ముందు నామీద అపారప్రేమచే నాకు బహూకరించిన దివ్యశరీరరూపప్రదర్శనమును మరిచిపోలేనోయి. నా మనఃఫలకంపై చిత్రించుకున్నాను. అనంతకాలమూ ఆ రూపాన్ని అట్లే పట్టిఉంచుకుంటాను మారన్నా!

కొమ్మన — (ఆశ్చర్యంగా వింటూ) అయితే, తాతయ్యగారు యుద్ధంలో చనిపోయినారా బామ్మా?

అన్నమ్మ—అవును, పోయినారోయి.

కొమ్మన — మనము ఏడువకూడదుగాదూ బామ్మా?

అన్నమ్మ—కూడదు బాబూ!

కొమ్మన—(మొగముమీద దృష్టినిలిపి) నువ్వు కూడా ఏడువబోకు బామ్మా! తాతయ్యకు వీరస్వర్గము రాదు మనము యేడుస్తే.

అన్నమ్మ—(దుఃఖము బిగబట్టుకొని) ఏడువను లే బాబూ! (మారన్నతో) మారన్నా! నన్ను నెమ్మదిగా గౌరీమందిరంలోకి తీసుకొనిపో. బాబును అటూ ఇటూ తీసుకొనిపోయి వాడివాండ్లు వచ్చేవరకు సమదాయించి కనిపెట్టివుండు.

మారన్న—తల్లీ! ఇటు ఇటు.

అన్నమ్మ—(కాళ్లు తడబడుతూ కొద్దిదూరం అతను దారి చూపిస్తూంటే నడుస్తుంది.)

మారన్న—ఇదిగో గౌరీమందిరం.

అన్నమ్మ—నేను ఇక్కడ కూర్చుంటాను. ఇక నన్ను పలకరించవద్దు. తలుపు దగ్గరదోసి పో.

మారన్న—అట్లాగే తల్లీ! (తలుపు వేసి) ఒరే బాబూ, కొమ్మనా, రా. (చెయ్యి పట్టుకొని కొంత దూరం నడిపించును.)

కొమ్మన—ఇక్కడ కూర్చుందాం. నాకు యుద్ధపు సంగతులన్నీ చెప్పు.

(ఇద్దరూ కూర్చుంటారు)

మారన్న—చెప్పనా? భయపడవుగదా?

కొమ్మన—నాకా భయము? సంగతు లన్నీ చెప్పాలె. తాతయ్య ఏం చేశాడేమిటి, వెళ్లగానే?

మారన్న—తాతయ్య అశ్వికదళాన్ని రెండుగా చేశాడురా ముందు. మధ్యలో తాను రంగరాట్టుమీద నిలవబడ్డాడు చేతులో ధనుస్సు సంధించి.

కొమ్మన—సారంగుడో మరి?

మారన్న—అతనూ సైన్యాన్ని రెండుభాగాలు చేశాడు. మధ్యలో తానూ ఇంద్రనీలంమీద నిలువ బడ్డాడు.

కొమ్మన—తరువాత?

మారన్న—తరువాత తాతయ్య కుడివైపుబలాన్ని కదిపాడు.

కొమ్మన—ఇద్దరూ ఎదురుమళ్ళ నిలిపారుగదా బలాల్ని, సారంగుడు తన కుడివైపుబలాన్ని కదపలా?

మారన్న—(మెచ్చుకుంటూ) నీకు యుద్ధం ఎట్లా నడుస్తుందో తెలుసురా?

కొమ్మన—నే జెప్పింది సరేనా?

మారన్న—సరే.

కొమ్మన—నన్ను సైన్యంలో చేర్చుకోమంటే మొన్న తాతయ్య 'నువ్వు చిన్నవాడి' వన్నాడు. లేకపోతే నేనుకూడా రణరంగానికి రాకపోయినానా? ఆc- తరువాత ఏమి జరిగింది?

మారన్న — తాతయ్య ఎడమవైపుబలాన్ని కొద్దిగా ముందుకు నడిపాడు. సారంగుడి బలం రెండడుగులు వెనుకకువేసింది.

కొమ్మన—మన కుడివైపుబలం ఏం జేసింది?

మారన్న—అకస్మాత్తుగా ఒక్కపెట్టున శత్రుసైన్యంమీద పడ్డది. సారంగుడి ఎడమబలమూ, మన బలమూ కదిశాయి.

కొమ్మన—అప్పుడే సరైన యుద్ధం మొదలన్నమాట. ఆc.

మారన్న— తాతయ్య అల్లెతాడు ఖంగున మోగించాడు.

కొమ్మన—సారంగు డేమి చేస్తున్నాడు? బాణ ప్రయోగం చెయ్యలేదా?

మారన్న—చేశాడు. దాన్ని తాతయ్య మధ్యలోనే తుంచేశాడు.

కొమ్మన—బలే! అన్నీ మధ్యలో విరుగగొట్టాడుగా?

మారన్న—ఆc. కొట్టేశాడు. సారంగుడుమాత్రం పూరుకున్నాడా?... బాబూ! అరుగోరా, బళ్ళమీద మీ అమ్మగారూ, దొడ్డబొమ్మగారూ వచ్చిన ట్లున్నారు. పో, తీసుకురా.

[ప్రవేశము: సీతమ్మ, ప్రోలమ్మ]

కొమ్మన— (పరుగెత్తుకుంటూ పోయి సీతమ్మ ప్రక్కన నిలువబడి వాండ్లను నడిపించుకొనివస్తాడు.)

సీతమ్మ— (పరికించి) దివాణమంతా చిన్నబోయివుంది.

ప్రోలమ్మ—అంత పరివారంగదా! అడుగో మిగిలాడు - కోనగావలి-దివాణంవూడ్చే ముసలిబయ్యన్న. కాస్త పనికివచ్చేవాండ్లంతా యుద్ధానికి పోయినారు. (కంటికి చేయి అడ్డం పెట్టుకొని చూచి) అడుగో మారన్న. నీవు పోలే యుద్ధానికి?

మారన్న—పోయివచ్చాను తల్లీ!

ప్రోలమ్మ—అట్లాగా? అమ్మా యెక్కడ?

మారన్న—గౌరీమందిరంలో వున్నారు.

ప్రోలమ్మ—పద.

సీతమ్మ— అత్తయ్యమొగం ఎట్లా చూడడం అత్తయ్యా!

ప్రోలమ్మ—ఏమి చేస్తామే తల్లీ! మనచేతనయిన పనా? అన్నా, అన్నా!

సీతమ్మ—(దగ్గరకు బోయి మొగముమీద చెయిబట్టి నిమురుతూ) అత్తయ్యా! ఇదేమిటి? మొగమంతా బిగుసుకపోయింది!

ప్రోలమ్మ—(ఒళ్లు పట్టిచూచి) ఒళ్లంతా అట్లాగే వుంది. మరణవార్త అకస్మాత్తుగా వినబట్టి నరాలన్నీ బిగబట్టివుంటవి. మెల్లిగా వేళ్లతో ఒంటిమీద రాయండి. (కాసినినీళ్లు మొగముమీద చిలకరించి) తల్లీ, అన్నా!

కళ్లు తెరచి చూడు. నేను అక్కయ్యను. సీత చూడు, ఎట్లా దుఃఖపడుతున్నదో!

అన్నమ్మ—(కళ్లెత్తిచూచి, నెమ్మదిగా లేచి కూర్చున్నది. దుఃఖము ఆపుకోలేక వెక్కుతూ 'అక్కయ్యా' అని శావలించుకున్నది.)

కొమ్మన—బామ్మా! ఏడువకూడదు. ఏడుస్తే తాతయ్యకు కష్టమవుతుంది.

ప్రోలమ్మ—(వీపు నిమురుతూ) ఎంత అణుచు కుందామన్నా ఆగదే తల్లీ! తలగాలిందే దుఃఖము, కడుపుకాలిందే దుఃఖమని ఆపితే ఆగేది కాదే తల్లీ!

సీతమ్మ—కళ్లెత్తి చూడు అత్తయ్యా. ఏదైనా మాట్లాడు నాతో. నాకు భయంగా వుంది అత్తయ్యా!

అన్నమ్మ—(కొద్దిగా తల యెత్తి, కండ్లు తెరచి) ఏముంది మాట్లాడడానికి? అంతా అయిపోయింది. పెద్ద వాడు వచ్చాడా?

సీతమ్మ—రాలే దింకా. ఇప్పుడో, ఇంకాసేప టికో వస్తా రనుకుంటున్నాము.

అన్నమ్మ—రాంగానే చెప్పు అక్కయ్యా,, మన కీరాత తప్పిందికాదుగదా!

ప్రోలమ్మ—తప్పదే తల్లీ! తప్పించుకోవడం మన వశమా అమ్మా! ఇంత పసుపూకుంకుమాతో వెళ్లి పోయే వ్రాత మనకు వ్రాయలేదు. అదే పుణ్య వతులకో?

సీతమ్మ—అరుగో మీపెద్దబ్బాయి వస్తున్నారు అత్తయ్యా!

అన్నమ్మ—వచ్చాడా నాతండ్రి?

సీతమ్మ—ఆఁ, వచ్చారు. ముంగిట వున్నారు.

కొమ్మన—(గంతు వేసి ముందుగా పోయినాడు)

[ప్రవేశము: మనుమసిద్ధి, తిక్కన, కొమ్మన]

కొమ్మన—(దగ్గరకు పోయి) నాన్నా, తాత య్యగారు వీరవిహారం చేసి వీరస్వర్గానికి వెళ్లారుట గాదూ?

తిక్కన—ఎవరు చెప్పారు బాబూ?

కొమ్మన—మూరన్న చెప్పాడు. అవునా?

తిక్కన—అవును బాబూ!

రాజు—(చిరునవ్వుతో) ఎవరండీ పిల్లపిడుగు?

తిక్కన—చిన్నకొమ్మన్నండి. బాబూ! వీరు మన రాజుగారు. వీరికి నమస్కారం చెయ్యి.

కొమ్మన—(వీరపద్ధతిన నమస్కరించి, వీరవైఖ రితో నిలువబడతాడు)

రాజు—(వీరపద్ధతిన ప్రతినమస్కారం చేశాడు)

కొమ్మన—(వెనుకడుగులు వేసి ప్రక్కకు తప్పు కుంటాడు)

రాజు—ఆంధ్రజాతి అంతా ఇలా తయారైతే?

తిక్కన—శ్రీ గణపతిదేవ చక్రవర్తి, (శ్రీ) శివ దేవమహామంత్రి ఈకలలే కంటున్నారు.

రాజు—దేశం అంతఃకలహాలతో కుంగిపో తున్నది.

తిక్కన— తమ రిప్పటికైనా గ్రహించారు, సంతోషమే.

రాజు—(నాలుగడుగులు వేసి, విచారముతో నిలువబడుతాడు.)

తిక్కన—ఏమిటి ఆలోచిస్తున్నారు?

రాజు—నాకు గుండె దడదడలాడుతున్నది.

తిక్కన—గుఱ్ఱంమీద దీర్ఘప్రయాణం చేశారు. అది కొంచెము జరఫయిన జంతువుకూడాను.

రాజు—అందుకు కాదు. నేను అన్నమాంబ గారి ఎదుట పడటానికి భయపడుతున్నాను. దుఃఖము పట్టలేక ఏమి తీవ్రంగా మాట్లాడతారో!

తిక్కన — అమ్మగారి తండ్రి సూరన్నసోమ యాజులు శాపచాపముల రెంటిని సమానప్రతిభతో వర్తింపజేశాడు. ఆమె వీరపత్ని. (నవ్వుతూ) వీరమాత కూడాను. ఈ చిన్నకొమ్మన్నది ఆమెతీర్పు. మా వంశ నములో అయిదు తరములనుండి మా కత్తికీ, ఘంటా నికీ నీరసధార లేదు.

రాజు— మామా! క్షమించు. నిమిషములో వీరరసం కురిపించావు. ఇకమీద నీవు కత్తిని ఒరలో బెట్టి ఘంటాన్ని బయటికి లాగి ఆంధ్రావళిని సర్వతోముఖంగా విజృంభింపజేస్తూ కవిబ్రహ్మవై ఆంధ్రజాతిని సృష్టింతువుగాని.

తిక్కన—తమరు సిద్ధసంకల్పులుకదా!

(రాజు, తిక్కన గారీమందిరములోకి వస్తారు. ప్రోలమ్మ, సీతమ్మ నిష్క్రమిస్తారు.)

రాజు—అమ్మా! నమస్కారము.

తిక్కన—అమ్మా! మన రాజుగారు.

అన్నమ్మ— విజయవార్తలు విన్నాను. వారు ప్రభువువారి సేవలో అర్ధశతాబ్దము ప్రశంసాపాత్రంగా వర్తించి చివరకు వారి సేవలోనే వీరమరణము గాంచి ధన్యులైనారు—అని నా వాక్యములుగా వారితో మనవి చేయవోయి.

రాజు—అమ్మా! మా రాజకుటుంబము మీ మంత్రికుటుంబానికి మూడుతరములనుంచి ఎంతో ఋణపడి యున్నది.

అన్నమ్మ—ఈపిల్లవాడిని కనిపెట్టివుండండి.

రాజు—నాకు మంత్రి, సోదరుడు, తండ్రి, గురువుకూడా యీ పిల్లవాడే.

అన్నమ్మ—చిత్తము. ఇంతవరకూ మీ మా కుటుంబములకు అట్టి సంబంధమే వున్నది. మీ క్షేమమే మా క్షేమము.

నాయనా! నేను ఈవార్త విని నీకోసమే కనిపెట్టుకొనివున్నాను. సహగమనానికి నీవు ఏర్పాటు చేయించు.

తిక్కన—(కన్నీటితో) అమ్మా! నన్నేమిచేసి పోతావు? నాన్నవియోగమే భరించలేకుండావున్నాను.

అన్నమ్మ—అందరికీ భగవానుడే రక్షకుడు. నీకూ అతడే. భర్త పురుషుడు; భార్య ప్రకృతి. పార్వతీ పరమేశ్వరదాంపత్యమే మన వంశమునకు ఆదర్శము. పురుషుడు పోయినతరవాత జడస్వరూపమయిన స్త్రీ జీవితము నిరర్థకము.

తిక్కన—"ఆత్మావై పుత్రనామాసి" అని పుత్రుడు లేనప్పుడే శాస్త్రాలు సహగమనాన్ని అంగీకరించినవి తల్లీ!

అన్నమ్మ—పురాణదృష్టాంతములనుబట్టి ఆచారము భిన్నముభిన్నముగా నున్నదోయి.

తిక్కన—ఆచారమునకు శాస్త్రాధారము లేదు తల్లీ. ఇంకొక విషయముకూడ నీవు మన్నించవలసియున్నది. తండ్రిగారు మరణసమయములో నీవు సహగమనం చేయవద్దని, తన యీకడసారికోరికను మన్నించవలసినదని గట్టిగా చెప్పినారట. దొడ్డనాన్నగారు కూడ అటులనే తమ కోరికను వెల్లడించారు. దొడ్డమ్మగారుకూడ దానిని మన్నించారు.

అన్నమ్మ—ఇది వాస్తవమా?

తిక్కన—నీ పాదాలసాక్షిగా మనవిచేస్తున్నాను.

కొమ్మన—ఎందుకు నాన్నా, మీరు ఇంత వద్దని బలవంతపెడతారు?

తిక్కన—(నిర్ఘాంతపోయి, మళ్లా సర్దుకొని) బాబూ! తాతగారి ఆజ్ఞోయి యిది.

కొమ్మన—అయితే సరే.

రాజు—(కుర్రవాడిమీద చేయివేసి) భేష్! బాగుంది.

అన్నమ్మ—అక్కయ్యా! నీ వేమంటావు?

ప్రోలమ్మ—నేను కొండంత ప్రభువును పోగొట్టుకొని జడములాగ నిత్యభత్యాలు మింగుతూ రోజులు లెక్కబెట్టుకుంటూ జీవించడం వారి ఆజ్ఞచేతనేనే. నీవు కూడా తపస్సు చేసుకుంటూవుండు తల్లీ!

అన్నమ్మ—సరే. ఇక నిత్యకర్మకు ఏర్పాటు చేసుకోండి.

తిక్కన—ప్రభూ! లేతామా యికను?

రాజు—అమ్మా! శలవు.

అన్నమ్మ—చిత్తము.

[అందరూ నిష్క్రమింతురు]